‘అంగన్‌వాడీ’ల్లో వసతులు కరువు

- కనిపించని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- వసతులు లేక సతమతమవుతున్న చిన్నారులు, టీచర్లు

ధర్పల్లి: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. అరకొర వసతులతో కేంద్రాలకు వచ్చే పిల్లలు నిత్యం ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు కనీసం వసతులు కల్పించకపోగా అసలు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధర్పల్లి మండలంలో 22 గ్రామాల్లో 40 అంగన్ వాడీ కేంద్రాలతో పాటు 11 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 16 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, మరో 16 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా కేంద్రాలు ప్రాథమిక పాఠశాలలో, కమ్యూనిటీ హాళ్లలో అద్దె లేకుండా కొనసాగుతున్నాయి. వీటిల్లో 319 మంది గర్భిణులు, 339 మంది బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్ల



మద్దుల్ తండాలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



గుడితండాలో ..

లోపు పిల్లలు 1593, ఐదేళ్లలోపు 734 మంది పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకుంటున్నారు. మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి లేదు. కొన్ని కేంద్రాల్లో నిర్మించినప్పటికీ నీటి సదుపాయం కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

అద్దె భవనాల్లో అరకొర వసతులు

అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించడం వల్ల సమస్యలు అన్నీ ఇన్ని కావు. కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల అంగన్వాడి సిబ్బందితోపాటు, అక్కడికి వచ్చిన గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల తాగునీటిని కూడా పిల్లలు ఇంటి నుంచి తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. చిన్నారులు గాలి, వెలుతురు లేని ఇరుకైన గదుల్లోనే చదువు కొనసాగించాల్సి వస్తుంది. చిన్నారుల ఆట, పాటలకు సరైన వసతులు లేవు. ప్లాట్ ఫామ్స్ లేక స్టవ్ నేలపై పెట్టుకుని వంట చేస్తున్నామని ఆయాలు వాపోతున్నారు. అద్దె భవనాల్లో ప్లాట్ ఫామ్ నిర్మించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నిరుపేదలకు అండగా పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్



ఇందల్వాయి: హైదరాబాద్‌లో ఒక్క రూపాయికే కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్న అంకాపూర్ గ్రామానికి చెందిన పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ జిల్లాలో నిరుపేద అనాథలకు అండగా నిలుస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. నల్లవెల్లిలో శుక్రవారం నిలువ నీడ లేని నిరుపేద వృద్ధురాలు గూండ్ల మల్లవ్వకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు సంతోష్ రెడ్డి, సురేష్ రెడ్డి, లింగారెడ్డి, కర్రెన్న, కుంట గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నాగారం 300 క్వార్టర్స్‌లో కిరాయి ఇంట్లో నివాసం ఉండి కూలీపని చేసుకునే గౌనె నవీన్‌కు భార్య ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. నాలుగు సంవత్సరాల కిందట పక్షవాతం వచ్చి కాలు చేతు పని చేయడం లేదు. ఇప్పటి వరకు స్కూలులో పిల్లలకు పెట్టిన అన్నం సగం తిని నాన్నకు తెచ్చి పెట్టి ఆకలి తీర్చుకునే వారు. పాఠశాలలు బంద్ కావడంతో వారు శ్రీలక్ష్మి చేయూత సేవా సమితిని ఆశ్రయించారు. వెంటనే శుక్రవారం సేవా సమితి తరఫున రెండు నెలలకు సరిపడే కిరాణా సామగ్రిని వారు అందించారు.

మృతి చెందిన ఏఎస్సై కుటుంబానికి చెక్కు అందజేత



ఖలీల్‌వాడి: గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిరికొండ ఏఎస్సై ఎస్‌కే. భాషా కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కును నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీ ఆఫీస్‌లో శుక్రవారం ఇన్‌ఛార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ అందజేశారు. గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ క్రింద రూ.5 లక్షలు ఏఎస్సై సతీమణి గౌసియా బేగానికి అందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) మధుసూదన్ రావు, ఏవో శ్రీనివాస్, ఎస్బీఐ శ్రీశైలం, సూపరింటెండెంట్ మక్సూద్ హైమద్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు చేయూత



నిజామాబాద్ సిటీ: ఆడపిల్లల సంక్షేమం, సంరక్షణ కోసం ప్రభుత్వం అన్ని విధాల చేయూతనందిస్తుందని నిజామాబాద్ మండల వైస్ ఎంపీపీ అన్నం సాయిలు అన్నారు. శుక్రవారం నిజామాబాద్ మండల కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఎంపీవో మధురిమ ఆధ్వర్యంలో జరిగింది. మండల అధికారులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా పిల్లలను ఆదుకుంటుంది, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ, చైల్డ్ సర్వే సంరక్షణ అధికారులు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భానోత్ గోపాల్ నాయక్, మల్లారం, ధర్మారం సర్పంచులు నగేష్, రామ్ గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి అభినందన



డిచ్‌పల్లి: బర్ధిపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని శారోన్ ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 466 (ఎంపీసీ) మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రూరల్ ఇన్‌చార్జి కులాచారి దినేష్‌కుమార్, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్నలు శారోన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిషన్‌నాయక్, బీజేవైఎం జిల్లా సెక్రెటరీ పానుగంటి సతీష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రతాప్, కార్యకర్తలున్నారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నేత, అథ్లెటిక్స్ కోచ్ సయ్యద్ కైజర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు రాసిన లేఖను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని, అయినా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎంపీగా అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

ఖలీల్‌వాడి: బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే బాధ్యతల నుంచి తొలగించి, చట్టరీత్యా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ..మహిళా క్రీడాకారులు దేశ రాజధానిలో ఇన్ని రోజులుగా నిరసన చేస్తుంటే వారితో మాట్లాడడం గాని, మంత్రుల ద్వారా చర్చించడం గాని చేయకపోవడం దుర్మార్గమన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నేతలు

ఘనంగా ‘ధన్‌పాల్’ జన్మదిన వేడుకలు



ధన్‌పాల్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ధన్‌పాల్

సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ జన్మదిన వేడుకలు శుక్రవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు, అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దుబ్బ బీజేపీ శాఖ, ధన్‌పాల్ సూరన్న యువసేన ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అలాగే వర్షాలతో ఇల్లు కూలిపోయిన వారికి సొంతింటి కల నెరవేర్చి.. నేనున్నాననే భరోసాను వారికి కల్పించారు. కంఠేశ్వర్‌లోని మహాలక్ష్మీ ఆలయానికి రూ.5 లక్షలు ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేశారు. అనంతరం సూర్యనారాయణ మాట్లాడుతూ.. నగరంలో ప్రతి సంవత్సరం మాదిరిలాగే తన అభిమానులు పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పేదలను ఆదుకునేందుకు ధన్‌పాల్ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. జన్మదినం సందర్భంగా నాయకులు, కార్పొరేటర్లు ఆయన పేరుతో శంభుని గుడిలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



డిచ్‌పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏ లు



మోపాల్: ధర్నాలో మాట్లాడుతున్న వీఆర్‌ఏ జేఏసీ మోపాల్ మండల అధ్యక్షుడు బియ్యి సాయినాథ్

సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ డిచ్‌పల్లి, మోపాల్ మండలాల్లో వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. పేస్కేల్‌తో పాటు అర్హత కలిగిన వారికి పదోన్నతులు ఇస్తామని కేసీఆర్ చెప్పారని, అలాగే 55 సంవత్సరాలు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, ఇంత వరకు అమలు చేయలేకపోవడం సరికాదన్నారు. హామీని నిలబెట్టుకోని పక్షంలో మళ్లీ సమ్మెకు దిగుతామని వీఆర్‌ఏలు హెచ్చరించారు. – డిచ్‌పల్లి/మోపాల్

రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు



సాయికృపానగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఇళ్ల యజమానులు

చోద్యం చూస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 6వ డివిజన్ సాయికృపనగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్లను కబ్జా చేసి మరీ నిర్మాణాలు చేస్తున్నారు. టీఎస్ బిపాస్ చట్టం నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఎవరైనా తనకు సంబంధించిన స్థలంలో ఇళ్లు నిర్మించుకోవాలంటే కచ్చితంగా సెట్ బ్యాక్ 5 ఫీట్లు వదలాలి. నిబంధనలు తుంగలో తొక్కడమే కాకుండా సెట్‌బ్యాక్ వదలలేదు. పైగా రోడ్డుపై 8 ఫీట్ల వరకు ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారు. ఈ విషయం గురించి శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు స్థానిక కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

నిబంధనలు ఉల్లంఘించిన్నట్లు తెలిస్తే ముందుగా ఆ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధి అధికారులకు ఫిర్యాదు చేసి అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలి. కానీ డివిజన్ నంబర్–6లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు అధికారులు చోద్యం చూస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ఆధ్యాత్మికం

ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



డిచ్‌పల్లి: నడిపల్లిలో నిర్మించిన ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కులాచారి సతీష్‌రావు, అశ్విని దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. హంపి విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. వైస్ ఎంపీపీ కులాచారి శ్యాంరావు, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాంపల్లిలో ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



డిచ్‌పల్లి: సాంపల్లిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చౌడమ్మ ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. యాదవ సంఘం సభ్యులు ఇంటికో బోనం తీసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సమాచారం..

14న శ్రీలక్ష్మీ కుబేర దేవాలయం వార్షికోత్సవం

నిజామాబాద్‌సిటీ: నాగారంలోని శ్రీ లక్ష్మీ కుబేర దేవాలయం పంచమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకురాలు మాతా అనంత లక్ష్మి తెలిపారు. ఆదివారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దాసాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం

నిజామాబాద్‌సిటీ: నగరంలోని బొడ్డెమ్మ చెరువు గట్టుపైన ఉన్న శివపంచాయతన సహిత శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం(14న) నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ చిలుముల భూషణ్ చారి తెలిపారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



సుభాష్‌నగర్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగరంలోని ధర్నా చౌక్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె కొనసాగింది. శుక్రవారం నాటికి సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో చేపట్టిన కార్యక్రమాలను ముగ్గుల రూపంలో వేసి నిరసన చేపట్టారు. అలాగే వరంగల్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న జేపీఎస్ బైరి సోని ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జేపీఎస్‌లను విధుల్లో నుంచి తొలగిస్తారనే ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి శుక్రవారం రూ.15 లక్షల నిధులు మంజూరు చేశారు. గ్రామంలో నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం నిధులు మంజూరు చేస్తూ వీడీసీ వారికి ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆలూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బేగరి రాజు కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లెం భోజా రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరం



జక్రాన్‌పల్లిలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: నిరుపేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరం లాంటివని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్ల కుటుంబాలకు లక్ష రూపాయల చెక్కును కట్నం రూపంలో అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు ఎంతో రుణపడి ఉంటారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రామాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు సైతం చెక్కులను ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకొని పనిచేస్తున్న ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, జక్రాన్‌పల్లి ఎంపీపీ కుంచాల విమల రాజు, జెడ్పీటీసీ తనూజ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ మాస్కు తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వనదుర్గాదేవి(పెద్దమ్మ) ఆలయంలో శుక్రవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సత్కరించారు.

వీడీసీ సభ్యులకు అభినందనలు

డిచ్‌పల్లి: ధర్మారం(బి) గ్రామంలో ఇటీవలే నూతనంగా ఏర్పాటైన గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీడీసీ చైర్మన్ తలారి సాయన్నతో పాటు కమిటీ సభ్యులందరినీ ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వీడీసీ సభ్యులు విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఎస్ఎస్ఆర్ ప్రభంజనం



శ్రీకాంత్‌రెడ్డి



షేక్ శయాన్ అలీ

నిజామాబాద్ అర్బన్: 10, 12వ తరగతి సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో ఎస్ఎస్ఆర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 12వ తరగతి ఫలితాల్లో శ్రేయాస్ 436/500 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. నాగవైష్ణవి 402/500 మార్కులతో ద్వితీయ, శ్రీ నిత్య 383/500 తృతీయ స్థానంలో నిలిచారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఎస్ఎస్ఆర్ డిస్కవరి స్కూల్, ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ స్కూల్ జన్నేపల్లి విద్యార్థులు 100 శాతం ఫలితాలతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఎస్ఎస్ఆర్ సిబిఎస్ఈ స్కూల్ విద్యార్థులు శ్రీకాంత్ రెడ్డి 453/500, షేక్ శయాన్ అలీ 444/500, అమాన్ అజాస్ 417/500, ఆర్ కనిష్క గౌడ్ 413/500, మరియం మహిన్ 412/500, కుంట రోహన్ 410/500, జాదవ్ కౌషిక్ రామ్ 410/500, ఆదె యశస్విని 407/500, విధి చవ్వాల్ 406/500, బి శివాని 405/500, డి శ్యామ్ కైలాష్ 404/500, కీర్తన 403/500, ఆకుల విగ్నేష్ 401/500 మొత్తం 13 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో శ్రీమతి హరిత, ప్రిన్సిపాల్ భాస్కర్ అభినందించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,750	వెండి (కిలో)	78,300
22 క్యారెట్స్	57,858		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	4	10	క్యాప్సికం	30	50
బెండకాయ	30	60	గాజరుగడ్డ	20	30
బీరకాయ	30	60	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	50	70	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	50	70	గోబిపువ్వు	20	40
పాలకూర	60	80	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	50	70
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి



ఖలీల్ వాడి: సారంగపూర్‌లోని షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని, లేకుంటే రైతులకు అప్పగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు అన్నారు. శుక్రవారం నగరంలోని అర్సపల్లిలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలు మూతపడి 15 ఏళ్లు అవుతుందన్నారు. ఈ ఫ్యాక్టరీల మీద ఆధారపడిన కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో తెరిపిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి 9 ఏళ్లు దాటినా ఈనాటికి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈమధ్య కాలంలో మంత్రి కేటీఆర్ బోధన్ ఫ్యాక్టరీని రైతులు నడుపుకోగలిగితే సహకార రంగంలో అప్పజెప్పే దానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారని గుర్తు చేశారు. బోధన్, సారంగపూర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వమే నడిపించి కార్మికులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– కస్టడీ– 1.25,7.25,10.25
ఛత్రపతి(హిందీ)– 4.30
స్క్రీన్–2– సంగీతం స్కూల్–10.40,7.30
విరూపాక్ష–1.35,10.30
ఉగ్రం –4.30
స్క్రీన్–3 – కేరళ స్టోరీ(తెలుగు) – 1.40,7.30
కేరళ స్టోరీ(హిందీ)–4.30,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– ది కేరళ స్టోరీ(హిందీ)–10.05,1.05, 7.20,10.20
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (ఇంగ్లీష్)– 4.05
స్క్రీన్–2– గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3డ (ఇంగ్లీష్),12.20
కస్టడీ– 6.30,9.40
స్క్రీన్–3– ఛత్రపతి(హిందీ)– 11.00,7.05
కథ వెనుక కథ– 1.45
1871(హిందీ)– 4.25
భువన విజయం– 9.50
స్క్రీన్–4– సంగీతం స్కూల్–10.30,7.50
ఫర్హానా –1.20 –పొన్నియిన్ సెల్వన్–2–4.20
ఉగ్రం–10.40

దేవి	కస్టడీ
నటరాజ్	ఉగ్రం
లలితామహల్	రామబాణం
విజయ్	విరూపాక్ష